అభయహస్తం కాదు.. కబంధ హస్తం!

మొదటిపేజీ తరువాయి...

రుణాలు తీసుకోవాలంటే సంక్షేమ రంగాన్ని పణంగా పెట్టాల్సి వస్తుందని స్పష్టం చేస్తున్నారు. ఆదాయ, వ్యయాలపై ప్రపంచ బ్యాంకు గుత్తాధిపత్యం చెలాయిస్తుందని, వచ్చే ఆదాయాన్ని ఎలా ఖర్చు పెట్టాలో, దేనికి ఖర్చు పెట్టకూడదో ఆంక్షలు విధిస్తుందని చెప్తున్నారు. రాష్ట్ర ప్రజలు పన్నుల రూపంలో చెల్లిస్తున్న డబ్బును ఎలా ఖర్చు చేయాలో నిర్దేశిస్తుందని అంటున్నారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే తెలంగాణ 'ఆర్థిక' సార్వభౌమాధికారాన్ని ప్రపంచబ్యాంకుకు తాకట్టు పెట్టడమేనని హెచ్చరిస్తున్నారు.

20 ఏండ్ల తర్వాత..

తెలంగాణలో దాదాపు 20 ఏండ్ల తర్వాత 'ప్రపంచబ్యాంకు' అనే పేరు మళ్లీ వినిపిస్తున్నదని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు హయాంలో ప్రపంచబ్యాంకు బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఓ దశలో ప్రపంచ బ్యాంకు అనేది ఊతపదంగా మారింది. చంద్రబాబు ప్రభుత్వం విచ్చలవిడిగా ప్రపంచబ్యాంకు నుంచి రుణాలు తీసుకున్నది. తిరిగి వాటిని చెల్లించేందుకు ప్రజలపై పన్నుల భారం వేసి ముక్కుపిండి వసూలు చేసిందని నిపుణులు చెప్తున్నారు. ఈ క్రమంలోనే కరెంటు చార్జీలు పెంచేందుకు ప్రయత్నిస్తే.. బషీర్‌బాగ్‌లో కాల్పుల వరకు వెళ్లిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. ఆ తర్వాత వైఎస్సార్ సీఎం అయిన తర్వాత ప్రపంచబ్యాంకుతో కలుగుతున్న నష్టాలను గుర్తించి, తెగతెంపులు చేసుకున్నారు. ఆ తర్వాత ముఖ్యమంత్రులు కూడా ఈ విధానాన్ని కొనసాగించారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రపంచబ్యాంకును ఆమడ దూరంలో ఉంచింది. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు శిష్యుడు/సహచరుడిగా చెప్పుకుంటున్న రేవంత్‌రెడ్డి మళ్లీ ప్రపంచబ్యాంకును తెరమీదికి తెచ్చారని నిపుణులు అంటున్నారు.

అప్పు.. వడ్డీ.. వసూలు

ప్రపంచబ్యాంకు రుణాలు అంటేనే కఠినమైన నిబంధనలు ఉంటాయని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. ప్రైవేటీకరణ దాని ప్రధాన లక్ష్యమని, ప్రపంచబ్యాంకు నుంచి తీసుకునే రుణాలతో చేపట్టే ప్రాజెక్టులన్నీ పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో ఉండాల్సిందేనని అంటున్నారు. ఇక సంక్షేమ పథకాలకు ప్రపంచబ్యాంకు బద్ధ వ్యతిరేకి అని స్పష్టంచేస్తున్నారు. ప్రభుత్వాలు పేదలకోసం ఉచిత పథకాలు అమలు చేయొద్దని, ప్రతిదానికీ ముక్కుపిండి మరీ డబ్బులు వసూలు చేయాలన్నది దాని సిద్ధాంతమని పేర్కొంటున్నారు. రుణం ఇచ్చేముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని, ఆదాయ వ్యయాలను ప్రపంచబ్యాంకు క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. తీసుకునే అప్పును ఎలా ఖర్చుచేస్తారు? దాని నుంచి ఆదాయం ఎలా వస్తుంది? అప్పు, వడ్డీ కలిపి ఎలా చెల్లిస్తారు? అనే అంశాలను బేరీజు వేస్తుందని చెప్తున్నారు.

ఏటా రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులను బేరీజు వేస్తూ వ్యయ నియంత్రణకు ఆదేశాలు ఇస్తుందని తెలిపారు. ఒకవేళ రాష్ట్ర ఆదాయం తక్కువగా ఉండి, ఖర్చు ఎక్కువగా ఉంటే.. నిధుల విడుదలకు షరతులు విధిస్తుందని పేర్కొన్నారు. ఫలానా సంక్షేమ పథకంలో కోతలు విధించాలనో, లేదా లబ్ధిదారుల సంఖ్యను తగ్గించాలనో, లేదా పథకాన్ని పూర్తిగా ఎత్తివేయాలనో ఆదేశిస్తుందని చెప్తున్నారు. అమలు చేయకపోతే నిధుల విడుదలను ఆపడమే కాదు.. తీసుకున్న మొత్తం అప్పును కట్టాలంటూ పీకల మీద కూర్చుంటుందని హెచ్చరిస్తున్నారు. దీంతో వాటిని తీర్చడానికి మళ్లీ కొత్త అప్పులు చేయాల్సి వస్తుందని చెప్తున్నారు. ప్రపంచబ్యాంకు నుంచి రుణాలు తీసుకోవడం అంటే అప్పుల ఊబిలో కూరుకుపోవడమే అని హెచ్చరిస్తున్నారు. ఇక బ్యాంకు నిధులను ప్రజాసేవకో, ఉచిత పథకానికో అమలు చేస్తామంటే ఒక్క రూపాయి కూడా విదిల్చదని స్పష్టం చేస్తున్నారు.

సంక్షేమ పథకాలకు ఇకపై కోతలే..

కాంగ్రెస్ ప్రభుత్వం అభయ హస్తం పేరుతో ఆరు గ్యారెంటీలు, 400కు పైగా హామీలు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఐదు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని చెప్తున్నది. మిగతావాటిని కూడా కచ్చితంగా అమలు చేస్తామంటూనే.. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నదని, కిస్తీలు కట్టడానికి కూడా అప్పులు చేయాల్సి వస్తున్నదని ప్రచారం చేసుకుంటున్నారు. ఇలాంటి సమయంలో ప్రపంచబ్యాంకు నుంచి రుణాలు తీసుకోవడం అంటే.. సంక్షేమ పథకాలకు కోత పెట్టాల్సిందేనన్నది నిపుణుల మాట. ఓవైపు డబ్బులు లేవని బీద అరుపులు అరుస్తూ, మరోవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తామంటే ప్రపంచబ్యాంకు ఒక్క రూపాయి కూడా ఇవ్వదని స్పష్టం చేస్తున్నారు. కాబట్టి పథకాల్లో కోతలు విధిస్తేనే రుణాలు దక్కుతాయని చెప్తున్నారు. రాష్ట్రంలో మూసీ రివర్ ఫ్రంట్, స్కిల్స్ యూనివర్సిటీ, హైదరాబాద్ 4.0, వైద్యారోగ్య రంగానికి సాయం చేసేందుకు ప్రపంచబ్యాంకు ముందుకు వచ్చిందని ప్రభుత్వం చెప్తున్నది. మొదటి మూడు ప్రాజెక్టులు ప్రపంచబ్యాంకు నిబంధనలకు తగ్గట్టే పీపీపీ పద్ధతిలో చేపట్టనున్నట్టు ఇప్పటికే స్పష్టత వచ్చిందంటున్నారు. ఆరోగ్య రంగంలో పెట్టుబడులు ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్నారు. అంటే.. సమీప భవిష్యత్తులో ప్రజలకు ఉచితంగా వైద్యం అందదా? అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచబ్యాంకు నిబంధనల ప్రకారం ఆదాయం చూపించాలని, ప్రజారోగ్యంలో ఆదాయం ఎలా చూపిస్తారని అడుగుతున్నారు. ఈ లెక్కన మళ్లీ యూజర్ చార్జీలు తెరమీదికి తెస్తారని అనుమానిస్తున్నారు. ఓవైపు అభయహస్తం అంటూనే.. మరోవైపు ప్రపంచబ్యాంకు రుణం కోసం పాకులాడుతూ రాష్ట్రాన్ని కబంధ హస్తాల్లోకి నెడుతున్నారని మండిపడుతున్నారు.

ప్రపంచవ్యాప్తంగా నిరసనలు..

ప్రపంచబ్యాంకు విధానాలపై ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. దశాబ్దాలుగా ప్రజా పోరాటాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్‌కు వ్యతిరేకంగా అనేక ఆఫ్రికా దేశాల్లో ప్రజలు రోడ్ల మీదికి వచ్చి నిరసనలు తెలుపుతున్నారు. నైజీరియాలో ఇటీవల 2.25 బిలియన్ డాలర్ల ప్రపంచ బ్యాంకు రుణం కోసం, ఆ దేశ అధ్యక్షుడు బోలా తినుబు పెట్రోల్ సబ్సిడీలను, విద్యుత్తు సబ్సిడీలను తగ్గించారు. చలామణిలో ఉన్న కరెన్సీ నోట్ల సంఖ్యను తగ్గించాలని నిర్ణయించడంతో దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు సమ్మె మొదలుపెట్టాయి. ప్రజలు రోడ్ల మీదికి వచ్చి 'నైజీరియాను స్వేచ్ఛగా వదిలేయండి' అంటూ నినాదాలు చేశారు. కెన్యాలోనూ ఇదే పరిస్థితి. 'ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్.. కెన్యాను మీ కబంధ హస్తాల నుంచి విడిచిపెట్టండి' అంటూ ప్రజలు రాజధాని నైరోబీలో ఉద్యమాలు చేస్తున్నారు. ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ విధానాల వల్ల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలుతున్నాయని, పర్యావరణానికి నష్టం కలుగుతున్నదని, వాతావరణ మార్పులతో విపత్తులు తలెత్తుతున్నాయని అమెరికాలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తున్నారు.

తక్కువ వడ్డీతో అప్పులు తెస్తం

- ప్రపంచ బ్యాంకు నుంచి నిధులు
- వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం
- పంటల బీమా చెల్లిస్తున్నం
- రైతు కూలీలకు 12 వేలు ఈ ఏడాది నుంచే
- పంద్రాగస్టు సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- గోల్కొండ కోటలో జాతీయ పతాకావిష్కరణ
- మాటల్లో తడబాటు.. విస్తుపోయిన ప్రజలు

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రాభివృద్ధికి అవసరమైన నిధులను ప్రపంచబ్యాంకు నుంచి సమకూర్చుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇటీవల అమెరికా పర్యటనలో ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడితో సమావేశమయ్యామని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి అవసరమైన నిధులను తక్కువ వడ్డీతో సమకూర్చుకుంటున్నటు చెప్పారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం గోల్కొండ కోటపై జాతీయ జెండాను ముఖ్యమంత్రి ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ శాఖల్లో విశిష్ట సేవలందించిన పలువురు అధికారులకు పురస్కారాలు అందజేశారు. అంతకుముందు సీఎం తన ఇంటి వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. అక్కడి నుంచి పరేడ్ గ్రౌండ్ చేరుకుని అమర జవాన్లకు నివాళులర్పించారు. అక్కడి నుంచి నేరుగా గోల్కొండ కోటకు చేరుకుని జెండా ఆవిష్కరించి ప్రసంగించారు. పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించినట్టుగా ఈ ఏడాది నుంచే రాష్ట్రంలోని రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున అందజేస్తామని తెలిపారు. రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.15 వేల చొప్పున పెట్టుబడి సాయం త్వరలోనే అందిస్తామని చెప్పారు. పంటలబీమా పథకం వర్తింపచేయడానికి ఈ ఏడాది నుంచి ఫసల్ బీమా యోజనలో చేరాలని నిర్ణయించినట్టు తెలిపారు. రైతుల తరపున బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని అన్నారు.

తప్పు జరిగితే సరిదిద్దుకుంటాం

పరిపాలనలో లోటుపాట్లు ఉంటే సలహాలు, సూచనలు స్వీకరించే సౌలభ్యం కల్పించినట్టు రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇంతటి వ్యవస్థలో లోటుపాట్లు ఉండొచ్చని, తమ నిర్ణయాల్లో తప్పు జరిగితే సరిదిద్దుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి ప్రత్యేక గుర్తింపు సంఖ్యగల డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు జారీ చేసే విధానాన్ని త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. రూ.500కే వంట గ్యాస్ పథకం వల్ల 43 లక్షలమంది, గృహజ్యోతి పథకం వల్ల 47.13లక్షల మంది లబ్ధిపొందుతున్నట్టు పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇండ్ల చొప్పున 4.5లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం

వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రూ. 31 వేల కోట్లు వెచ్చించి రైతును రుణ విముక్తుడిని చేస్తున్నట్టు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల కోసం ప్రతి నియోజకవర్గంలో ఒకే ఆవరణలో 25 ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్ల ను నిర్మించబోతున్నట్టు చెప్పారు. విదేశీ పర్యటనకు వెళ్లి ఫ్యూచర్ స్టేట్‌గా తెలంగాణను వారికి పరిచయం చేశామని, 40వేల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు.

ప్రసంగంలో తడబాటు

గోల్కొండ కోటలో సీఎం హోదాలో తొలిసారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన రేవంత్‌రెడ్డి పలుమార్లు తన ప్రసంగంలో తడబడ్డారు. దాదాపు 30నిమిషాలపాటు ప్రసంగించిన ఆయన కొన్ని పదాలను సరిగ్గా పలుకలేక పోయారు. 20కిపైగా పదాలను పలకడంలో తప్పులు దొర్లాయి. మరికొన్ని పదాలను చదువుతూ తడబడి ఆ తర్వాత సరిదిద్దుకున్నారు. కొన్నిచోట్ల అంకెలను తప్పుగా చెప్పారు.

సీఎం ప్రసంగిస్తుండగానే బయటకు..

గోల్కొండ కోటలో జాతీయ పతాకం ఆవిష్కరణ అనంతరం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తుండగానే పలువురు లేచి బయటకు వెళ్లేందుకు యత్నించారు. అక్కడే ఉన్న పోలీసులు దారికి అడ్డంగా కుర్చీలు పెట్టి వెళ్లి కూర్చోవాలని సూచించారు. వేడుకలను ప్రజలు వీక్షించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్యాలరీల నుంచి కూడా ప్రజలు లేచి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించారు.

తెలంగాణలో భాక్రానంగల్ ప్రాజెక్టు

'మన రాష్ట్రంలో నాగార్జునసాగర్, శ్రీశైలం, భాక్రానంగల్, శ్రీరామ్‌సాగర్ లాంటి ప్రాజెక్టులను నెహ్రూ ప్రారంభిస్తే తర్వాత వాటిని పూర్తిచేసి కోట్లాది మంది రైతుల పొలాలకు సాగు జలాలు పారించిన గొప్ప చరిత్ర ఇందిరాగాంధీకి దక్కుతుంది' అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే హిమాచల్‌ప్రదేశ్‌లోని బిలాస్‌పూర్ జిల్లాలోని భాక్రా గ్రామంలో సట్లెజ్ నదిపై భాక్రానంగల్ డ్యామ్ నిర్మించారు. వర్షపు నీటి నిల్వతోపాటు హర్యానా, రాజస్థాన్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలకు సాగునీరు అందిస్తుంది. ఉత్తర భారతంలో ఇది చాలా పెద్ద ప్రాజెక్టు. ఇది రాష్ట్రంలోనే ఉన్నట్టు చెప్పడంతో సోషల్ మీడియాలో ట్రోల్స్ మొదలయ్యాయి.

మైనార్టీలోనూ పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లు

- త్వరలో నాంపల్లి, బజార్‌ఘాట్‌లో ఏర్పాటు
- ఒక్కో హాస్టల్‌లో 100 మంది విద్యార్థులకు వసతి
- రాజేంద్రనగర్ సీవోఈలో స్కార్ట్‌క్లాసులు

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ) : బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమహాస్టళ్ల తరహాలోనే మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలోనూ పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు త్వరలోనే అందుబాటులోకి రానున్నట్టు ఆ శాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు. అన్ని సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో బాల, బాలికలకు వేర్వేరుగా ప్రీ, పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలు అందుబాటులో ఉండగా, మైనార్టీ సంక్షేమశాఖలో ఇప్పటివరకు లేవు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీ విద్యార్థుల కోసం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 204 గురుకులాలు ఏర్పాటు చేయగా, అవన్నీ ఏడాది కిందటే గురుకుల కాలేజీలుగా మారాయి. అయితే, ఇంటర్ అనంతరం డిగ్రీ, ఇతర కోర్సులు చదివే విద్యార్థులకు హాస్టళ్లు అందుబాటులో లేకపోవడంతో బాలురు, బాలికలకు వేర్వేరుగా పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లు ఏర్పాటుచేసి ఒక్కో హాస్టల్‌లో 100 మందికి వసతి కల్పించాలని నిర్ణయించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని బజార్‌ఘాట్, నాంపల్లిలో భవనాలు నిర్మించారు. పనులన్నీ దాదాపు తుది దశకు చేరుకున్నాయి. ఈ ఏడాది నుంచే వీటిని అందుబాటులోకి తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు మైనార్టీ సంక్షేమశాఖ అధికారులు వెల్లడించారు. రాజేంద్రనగర్‌లోని మైనార్టీ సీవోఈలో నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్కార్ట్ క్లాసులు నిర్వహించనున్నారు.

స్కిల్స్ యూనివర్సిటీ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్ర

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్‌గా మహీంద్ర గ్రూపు సంస్థల చైర్మన్ ఆనంద్ మహీంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఏడాదిపాటు పదవిలో కొనసాగనున్నారు. రేవంత్‌రెడ్డి ఇటీవలే ఆనంద్ మహీంద్రతో సమావేశమై స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు, లక్ష్యాలను వివరించి చైర్మన్‌గా కొనసాగాలని కోరిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో దీన్నిఏర్పాటు చేస్తున్నారు.

- మహిళా రైతుపై పోలీసుల దౌర్జన్యం

ఖమ్మం జిల్లా వైరాలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి సభ జరిగింది. ఈ సందర్భంగా తమ పోడు భూముల సమస్యను ముఖ్యమంత్రికి వివరించేందుకు ప్రయత్నిస్తున్న మహిళా రైతును అడ్డుకుంటున్న పోలీసులు

- కుర్చీలు అడ్డుపెట్టి మహిళల అడ్డగింత

గోల్కొండ కోట వద్ద వేడుకల సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగిస్తుండగా కొంతమంది మహిళలు అక్కడి నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు, సిబ్బంది కుర్చీలు అడ్డుపెట్టి అడ్డుకున్నారు.

- అంబులెన్స్‌కు దారి ఇవ్వక కాలినడకన బాలింత

గోల్కొండ వద్ద స్వాతంత్ర్య వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకావడంతో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి అంబులెన్స్‌ను అడ్డుకున్నారు. అందులో ఉన్న బాలింత నడుచుకుంటూ ఏరియా దవాఖానకు వెళ్లారు.

కేటీఆర్ వ్యాఖ్యలపై మహిళా కమిషన్ విచారణ

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ) : 'మహాలక్ష్మి' పేరిట ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై విచారణ చేపట్టనున్నట్టు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ట్వీట్ చేశారు. కేటీఆర్ వ్యాఖ్యలు మహిళలను అవమానించేలా ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించి విచారణ ప్రారంభించినట్టు వెల్లడించారు.

మహిళా కమిషన్ తీరు హాస్యాస్పదం

బీఆర్ఎస్ నేత రజితారెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మహిళా కమిషన్ తీరు హాస్యాస్పదంగా ఉన్నదని బీఆర్ఎస్ నేత రజితారెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలను సుమోటాగా స్వీకరిస్తున్నామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ఎక్స్‌వేదికగా పేర్కొనటాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పదుల సంఖ్యలో మహిళలపై అత్యాచారాలు జరిగినప్పుడు, పోలీస్‌స్టేషన్‌లో ఒక దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించినపుడు, బాలికల వసతి గృహాల్లో పరిణామాలపై ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేలపై సీఎం, డిప్యూటీ సీఎం అనుచిత వ్యాఖ్యలు చేసినప్పుడు స్పందించని కమిషన్ కేటీఆర్‌కు నోటీసులు పంపటం ఏమిటో అర్థం కావడంలేదని అన్నారు.

బ్యాక్‌లాగ్‌లన్నీ జాబ్‌క్యాలెండర్‌లోకే..!

- గురుకుల పోస్టుల్లో డౌన్‌మెరిట్ లేనట్టే
- ప్రాథమిక అంచనాలో 1700 నాన్‌జాయినింగ్స్
- డీఎస్సీ, జేఎల్ రిక్రూట్‌మెంట్ పూర్తయితే సగం ఖాళీ
- అన్నింటినీ వచ్చే జాబ్ క్యాలెండర్‌లోనే నింపేలా కసరత్తు

హైదరాబాద్, ఆగస్టు15 (నమస్తే తెలంగాణ): గురుకుల బ్యాక్‌లాగ్ పోస్టులన్నింటినీ తదుపరి జాబ్ క్యాలెండర్‌లోనే నింపేందుకు ప్రభుత్వం యోచిస్తున్నది. ఆ దిశగానే తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ రిక్రూట్‌మెంట్ బోర్డు(ట్రిబ్) ముమ్మర కసరత్తు చేస్తున్నది. డౌన్‌మెరిట్ కోసం ఎదురుచూస్తున్న 1:2 అభ్యర్థుల ఆశలపై నీళ్లు చల్లింది. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యుత్సాహం, రాజకీయ స్వార్థం వల్లనే వేలాది పోస్టులు మిగిలిపోయే దుస్థితి ఏర్పడిందని, దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని అభ్యర్థులు మండిపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ గురుకులాల్లో డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ, ఫిజికల్ డైరెక్టర్, స్కూల్ లైబ్రేరియన్, స్కూల్ పీడీ, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ తదితర 9,210 పోస్టుల భర్తీకి ట్రిబ్ గతేడాది ఆగస్టులోనే రాత పరీక్ష నిర్వహించింది. కోర్టు కేసులు, అర్హులు లేని పోస్టులను మినహాయించి 8,304 పోస్టులకు తుది జాబితా ప్రకటించగా, ఆయా సొసైటీలు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించి అభ్యర్థులకు పోస్టింగ్స్ సైతం ఇచ్చాయి. నెల గడుస్తున్నా పోస్టింగ్ ఆర్డర్ అందుకున్న వారిలో 1,700 మంది అభ్యర్థులు ఇప్పటికీ జాయిన్ కాలేదని తెలుస్తున్నది. ఇప్పటికే 2,104 పోస్టులు మిగిలిపోయాయి.

ట్రిబ్ పోస్టులు సగానికిపైగా బ్యాక్‌లాగ్

గురుకుల పోస్టులకు ఎంపికైన అభ్యర్థులే చాలా మంది టీజీపీఎస్సీ నిర్వహించిన జేఎల్ పోస్టులను సాధించారు. ప్రస్తుతం సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగుతున్నది. గురుకులాల్లో పోస్టింగ్ ఆర్డర్స్‌ను తీసుకున్న అభ్యర్థులు టీజీపీఎస్సీ రిజల్ట్ కోసమే ఎదురుచూస్తూ జాయిన్ కాకుండా ఉన్నారని తెలుస్తుంది. దీంతో గురుకుల పోస్టుల్లో చాలా మేరకు ఖాళీ అయ్యే అవకాశం ఉన్నది. మరోవైపు 11,062 డీఎస్సీ పోస్టులను ప్రకటించడంతో ఆ పరీక్షకు సైతం గురుకుల పోస్టులకు ఎంపికైన వారే పోటీపడ్డారు.

ట్రిబ్ చేపట్టిన నియామకాలు

పోస్టు	నోటిఫైడ్	నింపినవి	నింపనవి
డిగ్రీ గురుకులాల్లోని డీఎల్, పీడీ, లైబ్రేరియన్	793	740	53
జూనియర్ కాలేజీల్లో జేఎల్, పీడీ, లైబ్రేరియన్	1924	1898	26
పీజీటీ (పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్)	1276	1255	21
టీజీటీ (ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్)	4006	3718	288
స్కూల్ లైబ్రేరియన్	434	418	16
స్కూల్ ఫిజికల్ డైరెక్టర్	275	275	0
మొత్తం	8708	8304	404

కొడుకు ఆచూకీ చెప్పాలని దళిత మహిళకు వేధింపులు

- 3 నెలలుగా పీఎస్‌కు రప్పిస్తున్న పోలీసులు
- సీఎం సొంత జిల్లాలో దారుణం
- లాఠీతో కొట్టారని బాధితురాలు ఆవేదన

బషీరాబాద్, ఆగస్టు 15: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో పేద దళిత మహిళపై పోలీసులు కర్కషంగా వ్యవహరించారు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నవల్గాకు చెందిన దళిత మహిళ లోవాడ కళావతికి కొడుకు నరేశ్ (17) ఉన్నాడు. మండల పరిధిలోని కాశీపూర్‌కు చెందిన ఓ బాలికను నరేశ్ 3 నెలల క్రితం (మే 2వ తేదీన) ఎక్కడికో తీసుకెళ్లాడు. మే 5న బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో నరేశ్‌పై కిడ్నాప్ కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో నరేశ్ ఆచూకీ తెలపాలని తల్లి కళావతిని పోలీసులు స్టేషన్‌కు పిలిపించుకొని వేధిస్తున్నారు. తనకు తెలియదని చెప్తున్నా పట్టించుకోకుండా కొట్టారని బాధితురాలు తెలిపింది. కాళ్లు, చేతులపై లాఠీతో కొట్టారని, దాంతో నడవలేకపోయానని చెప్పింది. కొడుకు ఆచూకీ చెప్పకపోతే గన్నుతో కాల్చివేస్తానని ఎస్సై బెదిరించినట్టు వెల్లడించింది. మూడు నెలల నుంచి ప్రతి రోజు పోలీస్‌స్టేషన్‌కు రప్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. కూలిపనులు చేస్తే గానీ పుటగడవని తనను పోలీసులు ఇలా ఇబ్బందులు పెట్టడం తట్టుకోలేకపోతున్నానని, ఒక్కసారిగా చంపేస్తే కొడుకు కోసం చనిపోయిందన్న పేరైనా ఉంటుందని కన్నీరుమున్నీరవుతున్నది.

పీసీసీ చీఫ్ కౌన్?

- రేసులో బలరాం నాయక్, అడ్లూరి లక్ష్మణ్, మధు యాష్కి
- సామాజిక వర్గం కోణంలో ఎవరి ప్రయత్నాలు వారివే
- మహిళా విభాగం అధ్యక్షురాలి మార్పు కూడా తథ్యం
- మరో 20 నామినేటెడ్ పోస్టులకు అభ్యర్థుల ఎంపిక

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి ఢిల్లీ పర్యటనకు వెళ్లిన నేపథ్యంలో మళ్లీ పీసీసీ అధ్యక్ష పదవిపై కాంగ్రెస్‌లో చర్చ మొదలైంది. రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి సారథిని ఎంపిక చేసేందుకు పార్టీ అధిష్ఠానం సుదీర్ఘ కసరత్తు చేస్తున్నది. పార్లమెంటు ఎన్నికలు ముగిసిన వెంటనే పీసీసీ అధ్యక్షుడి ఎంపిక దాదాపు పూర్తయిందనుకుంటున్న సమయంలో అధిష్ఠానం తన నిర్ణయాన్ని వాయిదా వేసింది. ఆ సమయంలో మహేశ్‌కుమార్‌గౌడ్ పేరు ఖరారైనట్టు ప్రచారం జరిగింది. ఆయన పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేకు ధన్యవాదాలు తెలుపుతున్న ఫొటోలు కూడా విడుదలయ్యాయి. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి ఢిల్లీకి వెళ్లారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడి ఎంపికపై ప్రధానంగా చర్చ ఉంటుందని ప్రచారం జరుగుతున్నది. రాష్ట్రంలో రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఎవరికి పీసీసీ పదవిని అప్పగిస్తారన్న దానిపై తీవ్రమైన చర్చ జరుగుతున్నది. మహేశ్‌కుమార్‌గౌడ్ తనకు దాదాపు పదవి ఖాయమైందన్న ధీమాతో ఉండగా.. తాజాగా త